

మూడో వసంతంలోకి..

జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపనకు శ్రీకారం చుట్టి రెండేళ్లు పూర్తయ్యింది. - 8లో



పీహెచ్‌సీకి కొత్త భవనం

బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం నూతన భవనం మంజూరు చేసింది. - 9లో

గరిష్టం/కనిష్టం 31.0°/17°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై మధ్యాహ్నం ఆహ్లాదకరంగా, రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

55వ రోజు కొనసాగిన దీక్ష

భువనగిరి : బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామం అయిన బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులు చేపట్టిన దీక్ష ఆదివారం 55వ రోజు కొనసాగింది. దీక్షకు మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితులు పరిహారం కోసం 55 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. భూములకు పరిహారంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత జనరల్ అవార్డును తొలగించి కొత్త అవార్డు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జూపల్లి దేవేందర్, ఎంపీటీసీ ఉడుత శారద, మాజీ సర్పంచ్ రావుల నందు, వార్డు సభ్యులు పరమేష్, జిన్న నర్సింహ, సాయి, శ్రీశైలం, బాబు, రాజు, నవీన్, భాను, శివ పాల్గొన్నారు.

టీచర్ల అరెస్టు హేయం



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య

భువనగిరి : తమ న్యాయమైన డిమాండ్ల కోసం హైదరాబాద్‌లో దీక్ష చేస్తున్న టీచర్లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్తయ్య అన్నారు. అదివారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను 317 జీఓ ప్రకారం తిరిగి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లిన ఉపాధ్యాయులపై ప్రభుత్వం అనుసరించిన తీరు శోచనీయమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అరెస్టు చేసిన టీచర్లను, ఉపాధ్యాయ సంఘం నేతలను వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుంకోజు భాస్కర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నవీన్

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ, పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కురుమేటి నవీన్ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం మిర్యాలగూడలో జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవీన్‌కు అవార్డు ప్రదానం చేశారు.నవీన్ గత నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాడు. రక్తదానం, ఉచిత అంబులెన్సు సౌకర్యం, అనాథలు, వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించినందుకు గుర్తింపుగా పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్, సింధు తపస్సు, సయ్యద్ మొహినొద్దీన్, వాసు వన్స్‌మోర్, జనయేత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మున్నీషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో సర్వోదయ సంకల్ప్ శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని టూరిజం పార్కులో ఈ నెల 24, 25 తేదీల్లో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సర్వోదయ సంకల్ప్ శిబిరం నిర్వహించనున్నట్లు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్ తెలిపారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు రెండు రోజుల పాటు వారి విధులు, నిధులు, సుపరిపాలన, స్వాతంత్రోద్యమం, చట్టాలు తదితర అంశాలపై శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించనున్నట్లు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వార్డు సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ గునిగంటి రమేశ్‌గౌడ్, ప్రతినిధులు రుద్ర చంద్రప్రకాశ్, బిట్ల గణేశ్, గునిగంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి ప్రధానాలయం తిరువీధుల్లో భక్తుల రద్దీ

నరసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



కేసారం నుంచి దేవరపెట్టెను పెద్దగట్టుకు తరలిస్తున్న యాదవ కులస్తులు

ఎరువులు నేరుగా జిల్లాకే

నాగిరెడ్డిపల్లి వద్ద రాక్‌పాయింట్ మంజూరు

- గతంలో మిర్యాలగూడ నుంచి రవాణా
- రైతులకు తప్పనున్న ఖర్చులు
- తక్కువ సమయంలో అందనున్న ఎరువులు



భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గోదాముల వద్ద రాక్‌పాయింట్

సాక్షి, యాదాద్రి : రైతులకు ఎంతో ఉపయోగపడే రైల్వే రాక్ పాయింట్‌ను యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గోదాంలలో రాక్ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. కంపెనీల నుంచి ఎరువులను రైళ్లలో రవాణా చేయడానికి రైల్వే శాఖ అనుమతి మంజూరు చేసింది.ఈ నేపథ్యంలో రాక్‌పాయింట్ ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయశాఖకు ఆదేశాలు అందాయి. అయితే జిల్లా వ్యవసాయశాఖ మాత్రం రాక్ పాయింట్ ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలున్నాయి. ఎరువులను రాక్ పాయింట్‌లో దించడానికి కంపెనీలు తమ కోటా కేటాయింపులు చేయకపోవడం వల్లే ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

రైతులకు, సింగిల్‌విండోలకు ఉపయోగం

రాక్ పాయింట్ అందుబాటులోకి వస్తే రైతులతో పాటు ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడనుంది. ప్రస్తుతం కంపెనీల నుంచి మిర్యాలగూడ రైల్వే రాక్ పాయింట్‌కు రైళ్లలో ఎరువులు దిగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు లారీల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇందుకు అయ్యే రవాణా ఖర్చులను రైతు సహకార సంస్థలు, సింగిల్‌విండోలు భరిస్తున్నాయి. ఒక లారీ లోడ్‌ను మిర్యాలగూడ నుంచి రూ.16 వేలు చెల్లించి తీసుకువస్తారు.అదే ఇక్కడైతే రూ.4 వేలతో జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు తరలించవచ్చు. సింగిల్‌విండోల చార్జీలను ప్రభుత్వం భరిస్తుండగా ఎరువుల దుకాణాల నిర్వాహకులు రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఒక్కో బస్తాకు రైతుల నుంచి రూ.50నుంచి రూ.60వరకు తీసుకుంటున్నారు.

పొరుగు జిల్లాలకూ ప్రయోజనం

నాగిరెడ్డిపల్లిలో ఎరువుల రైల్వే రాక్‌పాయింట్ ఏర్పాటైతే యాదాద్రి భువనగిరితో పాటు నల్లగొండ, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట జిల్లాల రైతులకు సైతం మేలు చేకూరనుంది. ఎరువులు అత్యవసరం అయితే జిల్లా రాక్ పాయింట్ నుంచి తరలించే వీలుంటుంది. అంతేకాకుండా తక్కువ సమయంలో మండల కేంద్రాలకు, ఎరువుల దుకాణాలకు ఎరువులు సరఫరా చేయవచ్చు. దీంతో రైతులకు నాణ్యమైన, పాడైపోని ఎరువులు లభిస్తాయి.

రైతుల హర్షం

జిల్లాకు రైల్వే రాక్‌పాయింట్ మంజూరు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే త్వరగా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

మొదలుకాని సన్నాహాలు

భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో ఎరువుల రాక్ పాయింట్‌ను 2022 డిసెంబర్ 8న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వెంటనే ప్రారంభించాలని కేంద్ర వ్యవసాయ శాఖ కమిషనర్ దల్‌భీర్ సింగ్ రాష్ట్ర వ్యవసాయ శాఖకు డిసెంబర్ 28న ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ రాక పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటి వరకు మొదలుకాలేదు. దీంతో యాసంగి పంటలకు అవసరమైన ఎరువులను రైతులు అధిక రవాణా చార్జీలు చెల్లించి తెచ్చుకుంటున్నారు. రాక్‌పాయింట్ అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా బాధలు తప్పనున్నాయి.

కంపెనీలు కోటా కేటాయించాలి



నాగిరెడ్డిపల్లి గోదాంలకు మంజూరైన రాక్ పాయింట్‌కు ఎరువుల కంపెనీలు తమ కోటా కేటాయించాలి.ఈ విషయంలో ఎరువుల కంపెనీలతో మాట్లాడాను. ఇప్పటి వరకు కంపెనీల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను.రాక్‌పాయింట్ వల్ల రైతులకు ఎరువులు తక్కువ సమయంలో అందుబాటులోకి వస్తాయి. రవాణా ఖర్చులు తగ్గుతాయి. కంపెనీల నుంచి అనుమతి రాగానే రాక్‌పాయింట్ ప్రారంభిస్తాం.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి

ఓ లింగా..

- వైభవంగా పెద్దగట్టు జాతర దిష్టిపూజ మహోత్సవం
- కేసారం నుంచి గట్టుకు చేరిన దేవరపెట్టె
- జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు



భేరీ మోగిస్తున్న వట్టె జానయ్య యాదవ్ తదితరులు

చివ్వెంల,సూర్యాపేట రూరల్ : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సుమారు 500 సంవత్సరాల చరిత్ర గల ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకమారు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరగనున్న జాతరకు పదిహేను రోజుల ముందు ఆదివారం నాడు యాదవుల సంప్రదాయం ప్రకా రం దిష్టిపూజ మహోత్సవం జరిపించారు. ఈమేరకు ఆదివారం రాత్రి సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి మెంతబోయిన, మున్న, గోర్ల, బైకాను వంశస్తులు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి, కుంకుమ, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుగ్గిలం, మైశాచి, తల్లి, పిల్ల గొర్రెతోపాటు శ్రీ లింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మలతో ఉన్న దేవరపెట్టెతో ఊరేగింపుగా గట్టుకు బయలుదేరారు. దేవరపెట్టెను గుట్టకు పడమర వైపు ఉన్న మెట్లపై నుంచి గట్టుపైకి చేర్చి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేశారు. దిష్టిపూజకు అవసరమైన రెండు బోనాలను మున్న, మెంతబోయిన వారు తీసుకువచ్చి లింగమంతుస్వామికి సమర్పించారు. అనంతరం బైకాని వారు వాయిద్యాల నడుమ బలిహరణ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్, మెంతబోయిన నాగయ్య, శ్రీకృష్ణ కమిటీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి, జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీపీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

దిష్టి పూజ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం, ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్‌ఐలు, 34 మంది ఏఎస్‌ఐలు, 37 మంది కానిస్టేబుల్స్, 29 మంది హోంగార్డులతో బందోబస్తు నిర్వహించారు.

ఆయిల్‌పామ్‌తో రైతుల ఆర్థికాభివృద్ధి



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

అడ్డగూడూరు : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అడ్డగూడూరు మండల పరిధిలోని లక్ష్మీదేవికాల్వ గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ వ్యవసాయ క్షేత్రంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్‌పామ్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు.ఎప్పుడు సంప్రదాయ పంటలనే కాకుండా పంట మార్పిడి చేసి అధిక లాభాలు పొందాలన్నారు.ఆయిల్‌పామ్ పంట ఒక్కసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. మొక్కలు నాటి మూడేళ్ల వరకు అంతర్గత పంటలు కూడా సాగు చేయవచ్చన్నారు. ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీ లు ఇస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల పరిధిలో ఆయిల్‌పామ్ కంపెనీ కూడా ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ సురేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ వెంకటేశ్వర్లు అరుణకుమారి, ఉద్యానవన శాఖ అధికారి నసీమా, ఎంపీపీ దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్డగూడూదూరుకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ అశోక్‌రెడ్డితో పాటు మరో 20 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్ బాలెంల త్రివేణి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కిశోర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్ : తండాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని దాతర్‌పల్లి మధిర గ్రామం మైలార్‌గడ్డతండాలో రూ.10 లక్షల వ్యయంనిర్మించిన కమ్యూనిటీ భవనం, వాటర్ ఫిల్టర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొంగిడి సునీత మాట్లాడుతూ తండాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి పాలనలో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగానే తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తండాల అభివృద్ధి ఇప్పటికే ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. టీఆర్‌ఎస్ పాలనలోనే తండాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను కేసీఆర్ అమలు చేస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో మన ముఖ్యమంత్రి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రతి గ్రామంలో ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ బైరగాని పుల్లయ్య, ఉప సర్పంచ్ కాల్నె భాస్కర్, గ్రామశాఖ అధ్యక్షులు నరేష్, వార్డు సభ్యులు దీరావత్ సరోజ, నర్సింహనాయక్, పాండ్యానాయక్, హరిసింగ్ పాల్గొన్నారు.

ముంచిన మిర్చి!

తెగుళ్లతో దెబ్బతిన్న పంట

- సగానికి పడిపోయిన దిగుబడి.. కాయలో నాణ్యత లేమి
- క్వింటా రూ.14,000కే అడుగుతున్న వ్యాపారులు
- బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుత రేటు రూ.24,000



ఈ రైతు పేరు బండ యాదగిరి. ఇతనిది ఆత్మకూరు(ఎం) మండలం టి. రేపాక. గత ఏడాది లాభం రావడంతో ఈ సారి కూడా రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. పంటకు తామరనల్లి, ఎర్ర నల్లి సోకడంతో మందులు పిచికారీ చేశాడు. అయినా తగ్గకపోవడంతో సోలార్‌లైట్లు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం హోమియో మందు పిచికారీ చేస్తున్నాడు.





ఆత్మకూరు(ఎం)లో సాగవుతున్న మిర్చి తోట, తామర నల్లి సోకడంతో ఆకులు రాలిపోయిన మొక్క

ఆత్మకూరు(ఎం) : ఎన్నో ఆశలతో మిర్చి సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. పంట చేతికందే సమయంలో వాతావరణం అనుకూలించక తెగుళ్ల సోకడంతో దిగుబడి సగానికి పడిపోయింది. కొమ్మలు ఎండిపోవడంతో పాటు కాయకు కుళ్లు, మచ్చలు ఏర్పడి నాణ్యత పూర్తిగా దెబ్బతింది.

జిల్లాలో పరిస్థితి

బొమ్మలరామారం, తుర్కపల్లి, వలిగొండ, ఆత్మకూరు(ఎం), భువనగిరి, గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు మండలాల్లో మిర్చి సాగవుతోంది. లాభాలు బాగుండడంతో ఎప్పటిలాగే ఈసారి కూడా సుమారు 200 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఈ సారి నల్ల తామర పురుగు, ఎర్రనల్లితో పాటు పలు రకాల వైరస్‌లు దిగుబడిపై ప్రభావం చూపాయి.

ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి

అన్ని ధరలూ పెరగడంతో ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల ఆశించడంతో తోటల రూపురేఖలు మారిపోయాయి. పురుగులు పూత, ఆకులను పూర్తిగా తినేశాయి. మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు కూలీలకు డిమాండ్ ఉండటంతో కోత ఖర్చు పెరిగింది.

ధర ఇలా.. నల్లతామర, ఎర్రనల్లి సోకిన పంట తొలుత పండుగా చెట్టుపై ఎర్రగా అగుపిస్తుంది. చూడటానికి చాలా మంచిగా ఉంటుంది. పండు మిర్చిని తెంపే దశలో కాయపై నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. ఎండబెడుతున్నప్పుడు నల్లటి మచ్చలు తెల్ల రంగులోకి మారుతున్నాయి. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. ప్రస్తుతం క్వింటా రూ.24,000 ఉండగా వ్యాపారులు రూ.14,000లకే అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఉన్న పంటను కాపాడుకునే ప్రయత్నం

పురుగులు, వైరస్ ఫెస్టిసైడ్ మందులకు నియంత్రణలోకి రాకపోవడంతో పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. చేలల్లో ఎల్లో ప్లేట్లు, సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. హోమియో మందులను కూడా పిచికారీ చేస్తున్నారు. సేంద్రియ కషాయాలు తయారు చేస్తూ పిచికారీ చేస్తున్నారు.

సగం ధరకే అడుగుతున్నరు



రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేసిన. పూర్తిగా తామర నల్లి సోకింది. ఇప్పటికి రూ. 2లక్షలు పెట్టుబడి వచ్చింది. అప్పు తెచ్చిన. గత 15 సంవత్సరాల నుంచి మిరప సాగు చేస్తున్నా. ఎప్పుడు ఇంత అధ్వానంగా కాలేదు. కాయను సగం ధరకే అడుగుతున్నరు.

– జక్క మల్లారెడ్డి, పోతిరెడ్డిపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేసిన. గతంలో ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఇప్పుడు ఏ క్వింటాళ్ల కంటే ఎక్కువగా వస్తలేదు. కాయంతా తెల్లగా మారింది. మార్కెట్‌కు పోతే ధర లేదు. తామరనల్లి, ఎర్ర నల్లితో తీవ్రంగా నష్టపోతున్నాం. పంటలను చూడటానికి అధికారులు వస్తలేరు. రైతులకు కనీసం సలహాలు ఇచ్చే వారు కూడా లేరు.

– జీగరి శ్రీహరి, టి.రేపాక

ధర రాక నిల్వ ఉంచిన



రెండు ఎకరాల్లో మిర్చి పంట వేసిన. ఇప్పటి వరకు రూ.రెండు లక్షలు పెట్టుబడి వచ్చింది. బ్యాంక్‌లో అప్పు తీసుకువచ్చిన. కాయ తెంపి ఎండపోసినం. అంతా తెల్లగా మారింది. మార్కెట్‌లో ధర లేదని తెలిసింది. నష్టానికి అమ్ముకోలేక బావి వద్ద నిల్వ ఉంచిన.

– కోల భిక్షం, పోతిరెడ్డిపల్లి

క్లుప్తంగా

మెట్ల పైనుంచి జారిపడి మత్స్యకార్మికుడి మృతి


తులసీదాసు (ఫైల్)

అర్వపల్లి: ఇంట్లో మెట్ల పైనుంచి జారిపడి మత్స్యకార్మికుడు మృతిచెందిన ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లంపల్లి గ్రామానికి చెందిన మత్స్యకార్మికుడు గద్దగూటి తులసీదాసు(45) ఆదివారం గ్రామ శివారులోని చెరువులోకి తోటి మత్స్యకార్మికులతో కలిసి చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. అనంతరం స్నానం చేయడానికి వెళ్తూ ఇంటి పైన ఆరేసిన దుస్తులు తీసుకొని కిందికి వస్తూ మెట్ల పైనుంచి జారిపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు వచ్చి చూసేసరికి అప్పటికే తులసీదాసు మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు, అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు గ్రామానికి వచ్చి తులసీదాసు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


గంజికుంట సాంబయ్య

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని హనుమాన్‌పేట కాలనీలో నివాసముంటున్న గంజిగుంట సాంబయ్య గత కొన్ని రోజులుగా కనిపించడం లేదని అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య ఆదివారం తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్న సాంబయ్య గతేడాది నవంబర్ 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం రాత్రి అతడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440731986, 8186865497 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముచ్చటగా మూడో వసంతంలోకి..

- నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్న నిత్య జనగణమన గీతాలాపన
- నల్లగొండ పట్టణంలో రోజూ కొనసాగుతున్న కార్యక్రమం
- జిల్లా అంతటా విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు
- నేడు చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ద్వితీయ వార్షికోత్సవం
- హాజరుకానున్న సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జాతీయ గీతాలాపన చేస్తున్న పట్టణవాసులు

రామగిరి(నల్లగొండ): యువతలో దేశభక్తి పెంపొందించాలనే సంకల్పంతో జనగణమన ఉత్సవ సమితి ఆవిర్భవించింది. ఈ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 2021 జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ప్రారంభమై సోమవారంతో రెండేళ్లు పూర్తయ్యాయి. పోలీసు శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 12 కూడళ్లలో మైక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు అన్ని కూడళ్లలో ఒకేసారి జాతీయ గీతాలాపన ప్రారంభమవుతుంది. ఆ సమయంలో రోడ్లపై వెళ్తున్న పాదచారులతో పాటు వాహనదారులు సైతం స్వీయ క్రమశిక్షణతో తమ వాహనాలు ఆపి జాతీయ గీతం ఆలపిస్తారు.

ఇతర ప్రాంతాలకు విస్తరణ..

మొదట నల్లగొండ పట్టణంలో మాత్రమే నిర్వహించిన ఈ జాతీయ గీతాలాపనకు ప్రజల్లో మంచి స్పందన వస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. 2022 జనవరి 27న తిప్పర్తి మండల కేంద్రంలో, 2022 ఆగస్టు 15న నార్కట్‌పల్లిలో, శుక్రవారం నుంచి పానగల్లులో ప్రారంభించారు. దాతల సహకారంతో రాబోయే రోజుల్లో మిర్యాలగూడ, చండూరు, మునుగోడు, కనగల్‌లో కూడా జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు.

నేడు 'ద్వితీయ' వేడుకలు

నల్లగొండ పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షహాల్‌లో సోమవారం ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'జాతీయ సమైక్యతను పెంపొందించడంలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యాం హాజరువుతున్నట్లు తెలిపారు.

అంతటా విస్తరించేందుకు కృషి



మొదట ఈ కార్యక్రమాన్ని నల్లగొండ పట్టణంలో మాత్రమే నిర్వహించాం. దాతలు ముందుకు రావడంతో తిప్పర్తి, నార్కట్‌పల్లి, పానగల్లులో కూడా ప్రారంభించాం. రాబోయే రోజుల్లో జిల్లా అంతటా అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో నిత్యం జాతీయ గీతాలాపన ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– కర్నాటి విజయ్‌కుమార్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు

ప్రజల స్పందన బాగుంది



నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి ప్రజలు, యువత నుంచి స్పందన బాగుంది. చిన్న వయసు వారి నుంచి వృద్ధుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయడమే మా లక్ష్యం, ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందించేందుకు గాను జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తాం.

– కొలనుపాక రవికుమార్, జనగణమన ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి

వ్యక్తిని హత్య చేసి.. ఆపై కాల్చేసి..

- కలకలం రేపిన సగం కాలిన మృతదేహం
- గుర్తుపట్టలేనంతగా కాలిన ముఖం, ఛాతి భాగం
- చెర్వుగట్టు గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో ఘటన
- హతుడి వివరాల కోసం పోలీసుల ఆరా


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ

నార్కట్‌పల్లి: ఓ వ్యక్తిని హత్య చేసి ఆపై కాల్చేశారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ శివారులో వెలుగుచూసింది. కలకలం రేపిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెర్వుగట్టు గ్రామ శివారులో మోటే లక్ష్మయ్య వ్యవసాయ భూమి వెనకాల ఉన్న వెంచర్‌లో ఆదివారం ఉదయం గడ్డి కాలిపోయి ఉండటం గమనించిన స్థానికులు దగ్గరికి వెళ్లి చూడగా, సగం కాలిన వ్యక్తి కాళ్లు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎక్కడో హత్య చేసి రాత్రి సమయంలో ఇక్కడకు తీసుకొచ్చి కాల్చి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల ఉంటుందని, ముఖం, ఛాతి భాగం గుర్తుపట్టలేనంతగా కాలిపోయిందని, మృతుడు నీలి రంగు నైట్ ప్యాంట్, ఎరుపు రంగుపై బూడిద రంగు గీతలు కలిగిన టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ శివరాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం అమావాస్య కావడంతో చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అయితే, రాత్రి సమయంలో వెంచర్‌లో మంటలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బొడిగె రామకృష్ణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440795635, 9440795610 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వైపునకు వస్తుంది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున లక్కారం శివారులోని తంగేడు వనం వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కన లారీ ఆగి ఉండటం గమనించిన బస్సు డ్రైవర్ తన బస్సును సైతం ఆపుకున్నాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేముల రాంమోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాండు తెలిపారు.

టీకా వికటించి చిన్నారి మృతి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు, కేసు నమోదు


చిన్నారి మృతదేహంతో రోదిస్తున్న తల్లిదండ్రులు

కోదాడరూరల్: అంగన్‌వాడీలో వేసిన టీకా వికటించి తమ చిన్నారి మృతిచెందాడని ఆదివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆ చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దేవరియ జిల్లాకు చెందిన సన్నెయికుమార్ గౌడ్ కోదాడకు వలస వచ్చి పట్టణంలో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి రెండు నెలల ఇరవై రోజుల వయసున్న బాబు ఉన్నాడు. ఆ చిన్నారికి టీకా వేయించేందుకు శనివారం పట్టణంలోని యాదవబజార్‌లో గల అంగన్‌వాడీ సెంటర్‌కి తీసుకెళ్లారు. చిన్నారికి జలుబు ఉన్నప్పటికీ అక్కడ ఏఎన్‌ఎం జయ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏమీకాదని టీకా వేసింది. కాగా అర్ధరాత్రి 2గంటల సమయంలో చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. టీకా వికటించే తమ కుమారుడు మృతిచెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్ తెలిపారు.

బావిలో పడి మోటార్ మెకానిక్ దుర్మరణం


వెంకట్‌రెడ్డి మృతదేహం

మిర్యాలగూడ: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఓ మోటార్ మెకానిక్ మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం చెరుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మాడ్గులపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుపల్లి గ్రామానికి చెందిన కొలగొట్ల వెంకట్‌రెడ్డి(48) ఆదివారం అదే గ్రామానికి చెందిన కట్టా అరుణకు చెందిన వ్యవసాయ బావి వద్ద మోటార్‌ను రిపేర్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. బావిలో నీరు నిండుగా ఉండడంతో ఈత రాని వెంకట్‌రెడ్డి మునిగి ఊపిరి ఆడక మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి


నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యక్తి మృతదేహం

చిట్యాల: పట్టణంలో అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని ఆదివారం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చిట్యాల ఎస్‌ఐ ఎస్. ధర్మా తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల మొబైల్ షాపు పక్కన అపస్మారకస్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు మున్సిపల్ సూపర్‌వైజర్ జోగు ప్రవీణ్ స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఆ వ్యక్తిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్ల ఉంటాయని, ఎరుపు రంగు టీషర్ట్ ధరించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే గొంగిడి సునీత


బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : బీఆర్‌ఎస్ పార్టీతోనే రాష్ట్రంలో, దేశంలో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బహదూరుపేట బీజేపీ మాజీ సర్పంచ్ జంపాల దశరథ, మంతపురి గ్రామ మాజీ సర్పంచ్ కందుల శంకర్ ఆధ్వర్యంలో దాదాపు 300 మందికిపైగా కార్యకర్తలు, నాయకులు పట్టణంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే సునీత, మహేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు రానివ్వకుండా మోదీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. భవిష్యత్‌లో కేసీఆర్ ఎలాంటి పిలుపు ఇచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు. అనంతరం గొంగిడి దంపతులను గజమాలతో సత్కరించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పుట్ట మల్లేషం, మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్, బాలస్వామి, దాసి సంతోష్, కౌన్సిలర్లు కందుల శ్రీకాంత్, బేతిరాములు, పేరపు సిద్దులు, వెంకటేష్, సంపత్, రామ్‌నర్సయ్య, పరుశరాములు, శ్రవణ్, నాగరాజు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

మఠ్రిగూడ: మండల పరిధిలోని రాజాపేటతండా, రాంరెడ్డిపల్లి, చర్లగూడెం గ్రామాలకు వెళ్లే కూడలి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఆ మూడు గ్రామాల కూడలిలో గుమ్మడికాయ, కొబ్బరికాయ, నిమ్మకాయలు, కోడి, కొత్త దుస్తులు, పసుపు, కుంకుమ కనిపించడంతో సమీప రైతులు, వాహనదారులు చూసి భయభ్రాంతులకు గురయ్యారు.

ఆలయాలకు పూర్వ వైభవమే లక్ష్యం


శివాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భువనగిరి: పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చందుపట్ల గ్రామంలో గల పురాతన శివాలయాన్ని ఫౌండేషన్ సభ్యులు సందర్శించి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పట్నం కృష్ణంరాజు మాట్లాడుతూ.. గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన శివాలయం ఆదరణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురాతన ఆలయాలను కాపాడాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 18 ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ సర్పంచ్ చిన్నం పాండు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే లింగయ్య

రామన్నపేట : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. మండలంలోని లక్ష్మాపురం, కొత్తగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల 150మంది కార్యకర్తలు ఆదివారం నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి క్రమం తప్పకుండా నిధులు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మందడి ఉదయ్‌రెడ్డి, పోచబోయిన మల్లేశం, సర్పంచ్ ఉప్పు ప్రకాష్, ఉపసర్పంచ్‌లు బత్తిని మహేష్, జి.ఆంజనేయులు, బత్తుల శంకరయ్య, కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, పులిపలుపుల వీరస్వామి, పొట్ట కృష్ణ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో కోయగూరి రాములు, నర్సింహ, రమేష్, ఉపేందర్, రమేష్, శ్రీను, సత్తయ్య, నవీన్, లింగస్వామి, భాస్కర్, జగన్, వెంకన్న, సైదులు తదితరులు ఉన్నారు.

బంద్రు నర్సింహులు జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న అమర్, విమలక్క తదితరులు

ఆలేరు: సీపీఐ ఎంఎల్ జనశక్తి రాష్ట్ర నాయకుడు బంద్రు నర్సింహులు జీవితం ఆదర్శనీయమని వామపక్ష నాయకుడు అమర్ అన్నారు. ఆదివారం పట్టణంలో బంద్రు నర్సింహులు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన అరుణోదయ నాయకురాలు విమలక్కతో కలిసి పాల్గొని బంద్రు దంపతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అమర్ మాట్లాడుతూ.. బంద్రు జీవితం కొత్త తరానికి ప్రేరణ ఇవ్వడానికి పుస్తకాన్ని తీసుకువస్తామని, అలాగే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అరుణోదయ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ.. నర్సింహులు జీవితం నేటి తరానికి మార్గదర్శమన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సత్తన్న, బైరాగి, విష్ణు, యాదన్న, రమేష్, ప్రభాకర్, భాస్కర్, శోభారాణి పాల్గొన్నారు.

'అజోల్లా'తో పశుగ్రాసం కొరతకు చెక్

- తక్కువ ఖర్చుతో పశువులకు అధిక పోషకాలు అందుతాయి
- సిరిపురం పశువైద్యశాల పశువైద్యాధికారి మాడుపల్లి రవికుమార్

పాడి పంట


రవికుమార్, పశువైద్యాధికారి

నడిగూడెం: వేసవిలో పశుగ్రాసం కొరతకు చెక్ పెట్టేందుకు అజోల్లా పెంపకమే సరైన పరిష్కారమని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆకుపచ్చ ఫెర్న్ జాతికి చెందిన ఈ నీటి మొక్క త్వరితగతిన పెరుగుతుందని, ఇది పశుగ్రాసానికి ప్రత్యామ్నాయమని నడిగూడెం మండలంలోని సిరిపురంలో గల పశువైద్యశాల పశువైద్యాధికారి మాడుపల్లి రవికుమార్ చెబుతున్నారు. అజోల్లా ఉత్పత్తి, దాని వలన పశువులకు కలిగే లాభాలు ఆయన మాటల్లోనే..

పుష్కలంగా పోషక విలువలు

అజోల్లా తిన్న పశువులకు అధిక పోషకాలు అందుతాయి. ఎండబెట్టిన అజోల్లా పొడిలో 25–35 శాతం వరకు మాంసకృత్తులు, 10–15 శాతం ఖనిజ లవణాలు, 7–10 శాతం అమినో ఆమ్లాలు, కెరోటిన్, బి–12 విటమిన్లు ఉంటాయి. అజోల్లాలో లిగ్నైట్ తక్కువగా ఉండడటం వలన పశువులు తేలికగా జీర్ణం చేసుకుంటాయి. ఒక కిలో అజోల్లా ఉత్పత్తికి 20–30 పైసలు మాత్రమే ఖర్చు అవుతుంది.

ఇలా పెంచాలి..

సూటిగా సూర్యకాంతి పడని కొద్దిపాటి నీడ గల భూమిని పూర్తిగా చదును చేసుకుని, 10 సెం.మీ లోతు గోతిని తవ్వాలి. అందులో చుట్టూ ఇటుకలను పేర్చి రైతుల తమకు ఇష్టమైన సైజులో ఒక తొట్టిని నిర్మించుకోవాలి. ఈ తొట్టి అడుగు భాగాన భూమిపై కలుపు పెరగకుండా ప్లాస్టిక్ సంచులు పరచాలి. దీనిపై 150 జీఎస్‌ఎం మందం ఉన్న ప్లాస్టిక్ షీటు వేయాలి. షీటు చివరలు ఇటుకల పై అంచువరకు వచ్చేలా తొట్టి మొత్తం పరచాలి. 30 నుంచి 35 కిలోల సారవంతమైన మట్టిని జల్లెడ పట్టి ప్లాస్టిక్ షీటుపై సమానంగా పరచాలి. ఒక చదరపు మీటరుకు 10 నుంచి 12 కిలోల పశువుల పేడను 10 లీటర్ల నీటిలో పలుచగా కలిపి, దానిలో 10–20 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్‌ను కలిపి పోయాలి. ఈ తొట్టిలో 7–10 సెం.మీ. ఎత్తు ఉండేలా నీరు పోయాలి. అందులోని మట్టి, నీటిని కలియ తిప్పాలి. ఆ తర్వాత 7–10 రోజుల్లో అజోల్లా పెరిగి నీటి తొట్టెను పూర్తిగా ఆక్రమిస్తుంది. 8వ రోజు నుంచి ప్రతి రోజు ఒక కిలో చొప్పున అజోల్లాను తొట్టి నుంచి తీసుకోవచ్చు.


తొట్టిలో పెంచిన అజోల్లా

పశువులకు మేపేది ఇలా..

ఇలా తొట్టి నుంచి తీసుకొచ్చిన అజోల్లాను చదరపు సెంటీమీటరు వెడల్పు ఉన్న రంధ్రాలు గల ప్లాస్టిక్ ట్రేలో ఉంచాలి. దానిని సగం నీరు నింపిన బక్కెట్‌పై పెట్టి పైనుంచి నీరు పోయాలి. ట్రేలో పైన ఉన్న అజోల్లాను పశువులకు మేపాలి. ట్రేలోని రంధ్రాల ద్వారా చిన్న చిన్న అజోల్లా మొక్కలు బక్కెట్‌లోని నీళ్లలోకి వెళతాయి. ఈ నీటిని మరలా తొట్టిలో పోయడం వలన అజోల్లాను తిరిగి పెంచవచ్చు. ప్రస్తుతం నడిగూడెం, కోదాడ మండలాల్లో వరి పొలాల్లో కూడా అజోల్లా కన్పిస్తుంది.

లాభాలు ఇవీ..

ప్రతి రోజు 1.5 నుంచి 2 కిలోల అజోల్లాను పశువులకు దాణాలో కలిపి తినిపించవచ్చు. దాణాలో వేరుశనగ పిండికి బదులుగా అదే పరిమాణంలో అజోల్లాను వాడవచ్చు. దీని వలన పాల దిగుబడి 15నుంచి 20 శాతం పెరుగుతుంది. పాలలో వెన్న శాతంలో పాటు ఎస్‌ఎన్‌ఎఫ్ పెరిగి ప్రతి లీటరు పాలకు 60 పైసలు నుంచి 150 పైసల వరకు అదనపు ఆదాయం వస్తుంది.